క్లుప్తంగా

మెడికల్, డిగ్రీ కళాశాల మంజూరుపై హర్షం



ధరూరు: జిల్లాకు మెడికల్ కళాశాల, మండలానికి మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర డిగ్రీ కళాశాల మంజూరు చేయడంపై బీఆర్ఎస్ మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, విజయ్ తదితరులు ఉన్నారు.

అయ్యప్ప స్వామికి అభిషేకం

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. బుధవారం అయ్యప్ప స్వామికి తేనె, నెయ్యి, పాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని అలంకరించారు. గ్రామస్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

శాంతినగర్: వడ్డేపల్లి పురపాలికలోని వార్డులను శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. బుధవారం తెల్లవారుజామున ఆయా వార్డుల్లోని సిబ్బంది పనితీరును ఆమె పరిశీలించారు. చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ఆమె వెంట కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



అయిజ: మండలంలోని వేణిసోంపురం గ్రామంలో వాల్మీకి విగ్రహం నిర్మించేందుకు బీఆర్ఎస్ నాయకుడు సంకాపురం రాముడు రూ. 50 వేలు విరాళంగా అందజేశారు. బుధవారం మండలంలోని సంకాపురంలో రాముడు నివాసం వేణిసోంపురానికి చెందిన వాల్మీకి ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేశాడు.

వానల కోసం అఖండ భజన



అయిజ: వానాలు సమృద్ధిగా కురువాలని మండలంలోని బింగిదొడ్డి గ్రామంలోని దొడ్డిరాయ స్వామి ఆలయంలో బుధవారం భక్తులు అఖండ భజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అఖండ భజనశనివారం వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో మండలంలోని వివిధ గ్రామాల భజన బృందం కళాకారులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



అయిజ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ప్రిన్సిపాల్ రాములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శ్రద్ధగా చదివి ఉన్నత స్థానంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కురిసిన తేలికపాటి వర్షం

ధరూరు: మండలంలో బుధవారం సాయంత్రం చిరు జల్లులు కురిశాయి. మధ్యాహ్నం 3:00 గంటల సమయంలో తేలికపాటి వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు మండలంలోని మన్నాపురం, జాంపల్లి తదితర గ్రామాల్లో స్వల్పంగా వర్షం కురిసింది. రెండు రోజులుగా ఊరిస్తున్న మేఘాలు.. స్వల్ప వర్షంతోనే సరిపెట్టింది. వానాకాలం పంటలు సాగు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్న రైతులకు వర్షాలు నిరాశనే మిగులుస్తున్నాయి.

రోడ్డుపై బైటాయింపు



అయిజ: మండలంలోని బింగుదొడ్డి చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని బుధవారం గద్వాల-అయిజ రోడ్డుపై గ్రామస్తులు బైటాయించారు. దీంతో ట్రాఫిక్ జాం అయ్యింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ఆందోళన విరమించాలని కోరినా ససేమిరా అన్నారు. దీంతో ఎస్ఐ నరేష్‌కుమార్ ఆర్అండ్‌బీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. గురువారం ఏఈఈ వచ్చి విచారణ చేస్తామని హామీ ఇవ్వడంతో బింగుదొడ్డి ప్రజలు ఆందోళనను విరమించారు.

వంతెనలు లేక అవస్థలు



మానవపాడు - అమరవాయి గ్రామాల మధ్యన పారుతున్న వర్షపునీరు(ఫైల్)



మానవపాడు-వయా చెన్నిపాడు గ్రామాల మధ్యన ఉన్న వంతెనను దాటుతున్న ప్రజలు

- ఏళ్లు గడుస్తున్నా ఎదురుచూపులే
- గ్రామీణులకు తప్పని తిప్పలు

మానవపాడు: వాగులు, వంకలపై వంతెనలు నిర్మాణాలు చేపట్టకపోవడంతో ప్రయాణికులకు, వాహనాదారులకు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా గ్రామాల మధ్య రోడ్లపై రాకపోకలు నిలిచిపోతున్నాయి. మండలంలోని పలు గ్రామాల మధ్య ఉన్న ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్‌శాఖలకు చెందిన బీటీ రోడ్ల మధ్య ఉన్న వాగులపై వంతెనలు లేక పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులకు నిత్యం తిప్పలు తప్పడం లేదు. వాగుల వద్ద రైతుల ఎద్దులబండ్లు ప్రమాదాల బారిన పడుతున్నాయి. వర్షాకాలంలో వాగుల వద్ద వరద ఉధృతి అధికంగా ఉంటుంది. దీంతో ఆయా గ్రామాలకు ప్రజల రాకపోకలకు స్తంభించిపోతాయి. అధికారులకు, పాలకులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నియోజకవర్గ వ్యాప్తంగా...

అలంపూర్ నియోజకవర్గంలోని 7 మండలంలో కలిపి 124 గ్రామాలు ఉన్నాయి. వర్షాకాలంలో ఆయా గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు, వాహనదారులు తిప్పలు తప్పడం లేదు. మానవపాడు మండలంలోని మానవపాడు-అమరవాయి, చెన్నిపాడు-మానవపాడు, అమరవాయి-కలుకుంట్ల, చెన్నిపాడు-పెద్దపోతులపాడు వంతెనలు, ఇటిక్యాల మండలంలోని ఆర్. గార్లపాడు-కరుపాకుల, ససనూలు-శేక్‌పల్లి, శేక్‌పల్లి-ఎర్రవల్లి, ఇటిక్యాల-ఉదండాపురం, ఉండవెల్లి మండలంలోని కలుగోట్ల-పుల్లూరు, ఉండవెల్లి-చిన్నఆముదాలపాడు, కంచుపాడు-చిన్నఆముదాలపాడు, వడ్డెపల్లి మండలంలో జులకల్లు-జులకల్లుస్టేజి, రామాపురం-వల్లూరు, కోంకల-వడ్డేపల్లి, రాజోలి రాజోలి-ముండ్లదిన్నె, తుమ్మిల-మాన్‌దొడ్డి, అయిజ మండలంలో అయిజ-పరదపురం, చిన్నతాండ్రాపాడు-అయిజ, అలంపూర్ మండలంలో అలంపూర్-గొందిమల్ల గ్రామాల ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. వర్షాకాలంలో వరద ఉధృతికి పూర్తిగా రాకపోకలు నిలిచిపోతున్నాయి.

వంతెన నిర్మించాలి



మానవపాడు మండలంలోని అమరవాయి- మానవపాడు రెండు గ్రామాలు వాగుల మధ్య వంతెన నిర్మించాలి. వర్షం కురిస్తే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కలుకుంట్ల, మద్దూరు, శాంతినగర్, చంద్రశేఖర్‌నగర్ గ్రామాలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నాం.

– బజారన్న, మానవపాడు

10 శాతం పనులు మాత్రమే పూర్తి



వర్షాకాలంలో ఇటిక్యాల మండలంలోని ఆర్. గార్లపాడు పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రతి ఏటా రాకపోకలు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆర్. గార్లపాడు వాగుకు నిధులు మంజూరు అయినా పిల్లర్ గుంతలు మాత్రమే తవ్వి వదిలేశారు.

– దండు బీసన్న, కారుపాకుల, ఇటిక్యాల

ప్రతిపాదనలు పంపించాం

అలంపూర్ నియోజకవర్గంలోని మండలాలలో ఉన్న వంతెన నిర్మాణాలు చేపట్టడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే నిర్మాణాలు చేపడతాం. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. వరద ఉధృతి అధికంగా ఉన్నప్పుడు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

– మహేష్, ఏఈ, ఆర్అండ్‌బీ అలంపూర్

రాష్ట్రంలో జనరంజక పాలన



సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

శాంతినగర్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో జనరంజక పాలన నడుస్తోందని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. వడ్డేపల్లి మండలంలోని బుడమర్సు, జిల్లెడుదిన్నె గ్రామాలకు రూ.35 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల పనులకు బుధవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికే దిక్సూచి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. రాష్ట్ర పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రజాహిత సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం అగ్రగామిగా ఉందన్నారు. మారుమూల గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యాలతోపాటు అంతర్గత రోడ్లకు నిధులు మంజూరు చేశామన్నారు. దీంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. బుడమర్సులో రూ.15 లక్షలతో, జిల్లెడుదిన్నెలో రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తైతే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఆర్డీఎస్ చైర్మన్ సీతారామిరెడ్డి, జెడ్పీటీసీ కాశపోగు రాజు, ఎంపీపీ రజిత, పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ లత, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తిమ్మప్ప, శారద, ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నాగరాణి

మల్దకల్: గర్భిణీ, బాలింతలకు పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి అన్నారు. బుధవారం మండలంలోని ఎల్కూర్, నీలిపల్లి, అమరవాయి అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. గర్భిణులు నెలనెలా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు పౌష్టికాహారంను తీసుకోవాలన్నారు. అంతకు ముందు బాలల పరిరక్షణ కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఆరోగ్యలక్ష్మి పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మమ్మ, రాధ, అంగన్‌వాడీ టీచర్లు యశోదమ్మ, పద్మమ్మ, తిమ్మమ్మ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల నిరసన

మల్దకల్: పంచాయతీ కార్మికులకు ప్రభుత్వం వెంటనే జీతాలు పెంచాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు హాలీమ్‌పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హాలీమ్‌పాషా మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు నెలనెల జీతాలు చెల్లించడంతో పాటు కనీస వేతనం ఇవ్వలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీఓకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: సీఎం కేసీఆర్ గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి కార్తీక్‌లు అన్నారు. గురువారం నుంచి గ్రామ పంచాయతీ కార్మికులు నిరవధిక సమ్మె చేపడుతున్నారని పేర్కొన్నారు. సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో వారు విడుదల చేశారు. సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వీవీ నర్సింహ్మా, రంగన్న, సత్యరాజు, ప్రవీణ్, హనుమేష్, బత్తాలయ్య తదితరులు ఉన్నారు.

కస్తూర్బాలో సీట్లు పెంచాలి



కలెక్టర్‌ను కలిసిన జెడ్పీటీసీ

గట్టు: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో సీట్ల సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ బాసు శ్యామల కలెక్టర్ వల్లూరు క్రాంతికి విజ్ఞప్తి చేశారు. బుధవారం జెడ్పీటీసీ కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో పేద కుటుంబాలకు చెందిన బాలికలు వివిధ కారణాలతో మధ్యలోనే చదువును నిలిపి వేస్తున్నారని వివరించారు. బాలికల చదువు మధ్యలో ఆగిపోకుండా కస్తూర్బా పాఠశాలలో సీట్ల సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు జెడ్పీటీసీ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

రాజోలి: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన ఘటన తూర్పు గార్లపాడు శివారులో బుధవారం చోటుచేసుకుది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మేకల లక్ష్మన్న తన ఆవులను మేత కోసం గ్రామ శివారులోని పొలాల వద్దకు తీసుకెళ్లాడు. ప్రమాదవశాత్తు ఆవు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యాదాఘాతంతో మృతిచెందింది. బాధితుడికి రూ.50వేలు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

సమయపాలన పాటించని ఆర్టీసీ బస్సులు



కాలినడకన వెళ్తున్న విద్యార్థులు

కేటీదొడ్డి: సమయపాలన లేకుండా ఆర్టీసీ బస్సులు రాకపోకలు కొనసాగించడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నిత్యం విద్యార్థులు కాలినడకనే పాఠశాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మండలంలోని ఉమిత్యాల, కేటీదొడ్డి, గువ్వలదిన్నె, కుచినెర్ల, తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు నందిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. ప్రతి రోజు బస్సులలో ప్రయాణించాల్సి విద్యార్థులు వేళాపాలా లేకుండా ఆర్టీసీ బస్సులు రావడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించక తప్పడం లేదు. బస్సులు సమయపాలన పాటించే విధంగా అధికారులు చర్యలు ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పిల్లలూ.. జర భద్రం



ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న విద్యార్థులు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బుధవారం ట్రాక్టర్‌పై ప్రమాదకరంగా ప్రయాణించారు. పరిమితికి మించి ఎక్కారు. పాఠశాల వదిలిన తరువాత బస్టాండుకు చేరుకుంటుండగానే ఓ ట్రాక్టర్ అటువైపు గుండా వచ్చింది. గమనించిన విద్యార్థులు పరుగెత్తుతూ ట్రాక్టర్‌పై ఎక్కేందుకు పోటీపడ్డారు. ఇరుకుఇరుకు కూర్చొని ప్రయాణించారు. ఈ దృశ్యాలను సాక్షి తన కెమరాలో క్లిక్‌మనిపించింది.

– ధరూరు

సంకల్ప రథయాత్ర విజయవంతం చేద్దాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎస్‌ఈయూ నాయకులు, ఉపాధ్యాయులు

అలంపూర్: పాత పింఛన్ విధానం సాధన సంకల్ప రథయాత్రను విజయవంతం చేద్దామని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డిలు కోరారు. బుధవారం పట్టణంలోని జోగుళాంబ అమ్మవారి ఆలయంలో నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హరిజనవాడ, న్యూప్లాట్స్ జెడ్పీహెచ్ఎస్, కాశీపురం పీఎస్, తహసీల్దార్, వ్యవసాయ శాఖ కార్యాలయం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, సబ్ ట్రెజరీ కార్యాలయంలో రథయాత్రకు పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సీపీఎస్ రద్దు-ఓపీఎస్ పునరుద్ధరణ లక్ష్యంతో ఈ నెల 16వ తేదీన అలంపూర్ నుంచి రథయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 172000 మంది సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉన్నారని సీపీఎస్ విధానంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం విధానం రద్దు చేసి దక్షిణాది భారతదేశంలోనే సీపీఎస్ రద్దు చేసిన మొదటి రాష్ట్రంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ రథయాత్రలో సీపీఎస్, ఓపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సంఘం బలోపేతానికి సభ్యత నమోదు చేపడుతున్నట్లు తెలిపారు. ఉద్యోగులు సభ్యత్వాలను పొందాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు బుచ్చన్న, నాయకులు ప్రతాప్ రెడ్డి, సుభాష్ నాయుడు, రమేష్, లక్ష్మీనారాయణ, ఈశ్వరయ్య, కృష్ణ, సతీష్ కుమార్ రెడ్డి, వెంకటకృష్ణ తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా యువకుడు మృతి

మానవపాడు: ట్రాక్టర్ ఇంజన్ బోల్తా పడి యువకుడి మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన కథనం ప్రకారం కర్నూల్ జిల్లా నిర్జూర్ గ్రామానికి చెందిన గోవర్ధన్(32) ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నాడు. ట్రాక్టర్ తీసుకొని తన వ్యక్తిగత పనుల నిమిత్తం కొర్విపాడు గ్రామానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కొర్విపాడు గ్రామం నుంచి అలంపూర్ చౌరస్తా వైపుకు వస్తుండగా మధ్యలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ ఇంజన్ బోల్తా పడింది. ఈ ఘటనలో గోవర్ధన్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు బాధితుడిని ప్రైవేట్ వాహనంలో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



కేటీదొడ్డి: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం సర్జాపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని వడ్డె మల్లేష్, మహదేవ్ తెల్లవారు జామున సర్జాపురం వాగు నుంచి పాగుంట గ్రామానికి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారు. అందుకున్న సమాచారం మేరకు పాగుంట శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు



మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాజు

మల్దకల్: బీపీ, షుగర్‌తో పాటు వివిధ రోగాలతో బాధపడుతున్న రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో వారు ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో 30 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి వారి వివరాలను రికార్డులలో పొందుపరచాలని సూచించారు. నెలనెల క్రమం తప్పకుండా మందులు అందజేయాలన్నారు. అదే విధంగా గ్రామాలలో పరిసరాల పరిశుభ్రతకు పాటుపడటంతో పాటు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాల సంఖ్యను మరింత పెంచాలన్నారు. అనంతరం కొత్తగా వచ్చిన డిజిటల్ రీచార్జిబుల్ బీపీ ఆపరేటర్లను వైద్య సిబ్బందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రాం కోర్డినేటర్ శ్యాంసుందర్, డాక్టర్ స్వరూపరాణి, సూపర్‌వైజర్ శ్రీధర్, సత్యమ్మ, వెంకటస్వామి, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

మానవపాడు: సైబర్ నేరాలపై బాలికలకు అవగాహన అవసరమని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బాలికలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలికలు పట్టుదలతో చదివి ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. ఎవరైనా వేధిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. బాలికలపై అసభ్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని వివరించారు. సిబ్బంది, బాలికలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గద్వాల క్రైం: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన బుధవారం పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు పట్టణంలోని రెవెన్యూ కాలనీకి చెందిన నూర్‌బాషా పని నిమిత్తం ద్విచక్రవాహనంపై న్యూ హౌసింగ్ బోర్డుకు వెళ్తున్నాడు. గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నూర్‌బాషాకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు బాధితుడిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

గట్టు: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బుధవారం జై నడిగడ్డ యువత ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలను అందజేశారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో జై నడిగడ్డ యువత ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులను సన్మానించి మెమెంటోలను అందజేశారు. గురుకుల, కస్తూర్బా, ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటుగా వివిధ ఉన్నత పాఠశాలల్లో ప్రతిభను కనబర్చిన విద్యార్థులను తహసీల్దార్ జుబేర్ మోహినొద్దిన్, ఎంఈఓ కొండారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, జై నడిగడ్డ యువత జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ రామకృష్ణలు అభినందించారు. బాగా చదివి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఓబులేష్, జై నడిగడ్డ యువత జిల్లా సమన్వయ కర్త పవన్‌కుమార్, నాయకులు శ్రీనివాసులు, మోహన్‌గౌడ్, అంజి, వీరేష్, సత్యం అశోక్‌గౌడ్, కార్తీక్‌గౌడ్, నర్సింహులుగౌడ్, రంగస్వామిగౌడ్, సుధీర్‌గౌడ్, శ్యాంసుందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి అర్బన్ గురుకుల పాఠశాలలో బుధవారం మండల విద్యాధికారి రాజు ఆధ్వర్యంలో క్రీడా పాఠశాలకు విద్యార్థుల ఎంపికను నిర్వహించారు. మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన 70 మంది విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల ఫిజికల్ ఫిట్‌నెస్ మెరిట్ ఆధారంగా క్రీడా పాఠశాలకు ఎంపిక చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఓ శేషన్న, పీఈటీ నర్సింహులు, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

అలంపూర్: పట్టణంలోని న్యూప్లాట్స్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మండల స్థాయి క్రీడా పాఠశాలల బాలికల ఎంపిక బుధవారం నిర్వహించారు. మండలంలోని ఆయా పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులను క్రీడా పోటీలు నిర్వహించి ఎంపిక చేసినట్లు ఎంఈఓ అశోక్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పీడీ నగేష్ బాబు, పీఈటీలు శైలజ, శ్రీనివాసులు, రాజు, నాగరాజు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాసులు, హెచ్ఎంలు బషీర్ అహ్మద్, నాగరాజు, సువిజ్ఞానం, రమేష్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధరూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్పోర్ట్స్ పాఠశాల ప్రవేశాల కోసం నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో 20 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఎంఈఓ సురేష్ తెలిపారు. ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు ఆయా పాఠశాలల నుంచి మొత్తం 70 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా స్థాయికి 20 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈఓ తెలిపారు.

జీతాలు పెంచాలని వినతి



సమ్మె నోటీసును అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

అలంపూర్: అరకొర జీతాలతో గ్రామ పంచాయతీ కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నరసింహ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటిండెంట్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 నుంచి 30 సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులకు పీఆర్‌సీ ప్రకారం కనీస వేతనం రూ. 19 వేలు ఇవ్వాలన్నారు. మల్టీ పర్పస్ విధానాలను రద్దు చేయాలని విన్నవించారు. కారోబార్, బిల్ కలెక్టర్‌లకు, అసిస్టెంట్ గ్రామ పంచాయతీ సిబ్బందికి పదోన్నతులు కల్పించాలని కోరారు. అనంతరం డిమాండ్లను నెరవేర్చాలని సమ్మె నోటీస్‌ను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సంఘం మండల అధ్యక్షుడు మద్దిలేటి, కార్మికులు మహేందర్, ఈరన్న నాయుడు దాసు, శివానంద్, లాలన్న, అఖిల్, మహేష్, శివ తదితరులు ఉన్నారు.